
# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 23 | పేజీలు: 4 | వెల: 4/- | ఆదివారం ● 11, ఆగస్టు 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## స్పీకర్ ప్రసాద్‌కుమార్‌పై అనుచిత పోస్టులు


- వ్యక్తిని అరెస్ట్ చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు



హైదరాబాద్,ఆగస్ట్10(నమస్తే ఉదయం): అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత పోస్టులు పెట్టిన నిందితుడిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు చేశాడు. తాజాగా జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడిన వీడియోలను సేకరించి స్పీకర్‌పై అనుచిత వాఖ్యలు చేసి, కించపరిచే విధంగా పోస్టులు చేసి సోషల్ మీడియాలో వైరల్ చేశాడు.ఈ విషయంపై గతంలో హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు అసెంబ్లీ కార్యదర్శి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వికారాబాద్ మోమిన్‌పేటకు చెందిన విజయ్ కుమార్ అనే వ్యక్తిని ఈ కేసులో అరెస్ట్ చేశారు. మిగతా.. 2లో

# 'పంచాయతీ' పోరుకు కసరత్తు ముమ్మరం

**ఓటరు జాబితా తయారీకి ఆదేశాలు - ఎంపీడీవోలు, ఎంపీవోలకు ఒకరోజు శిక్షణ పూర్తి**




హైదరాబాద్, (నమస్తే ఉదయం): గ్రామ పంచాయతీ ఎన్నికలకు త్వరలోనే నగారా మోగనుంది.

స్థానిక ఎన్నికల నిర్వహణపై ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలిచ్చిన నేపథ్యంలో యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి కసరత్తు సైతం ప్రారంభమైంది. ఎన్నికల నిర్వహణలో ప్రధానమైన వార్డుల విభజనపై ప్రభుత్వం మొదటగా దృష్టి సారించింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటరు జాబితాను తయారు చేయాలని అధికారులు ఆదేశించారు. ఇందుకు సంబంధించి ఇటీవల జిల్లా ప్రాజెక్టు మేనేజరు, కంప్యూటర్ ఆపరేటర్లకు హైదరాబాద్‌లో శిక్షణ కూడా పూర్తి అయింది. కాగా.. శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లతో జిల్లాలోని ఎంపీడీవో, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులకు గురువారం శిక్షణ ఇచ్చారు.

### పార్లమెంట్ ఓటరు జాబితా ఆధారంగా..


ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల ఓటరు జాబితా ఆధారంగా వార్డుల విభజన చేయాలని ప్రభుత్వం నిర్ణయిం చింది. ఇందుకు సంబంధించి పార్లమెంట్ ఎన్నికల ఓటరు జాబితాను అందించాలని ఎన్నికల సంఘానికి ప్రభుత్వం లేఖ రాసింది. ఎన్నికల సంఘం నుంచి నియోజకవర్గం, మండలాలు, గ్రామాల వారీగా ఓటరు జాబితా రాగానే వార్డుల వారీగా విభజన చేయాలని నిర్ణయించింది. వార్డుల విభజనకు సంబంధించి పాటించాల్సిన మార్గదర్శకాల పై మాస్టర్ ట్రైనర్లకు హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. ఒకే కుటుంబం అంతా ఒకే వార్డు పరిధిలో ఉండేలా విభజన చేయాలని ప్రధానంగా ప్రభుత్వం ఆదేశించింది. గత ఎన్నికల సమయంలో ఒక కుటుంబంలో ఓటర్లు రెండు, మూడు వార్డుల్లో ఉండడం, కొన్ని చోట్ల ఇతర గ్రామాల్లోనూ ఓట రుగా నమోదు అయి ఉండడం లాంటివి ప్రభుత్వం గుర్తిం చింది. ఈ క్రమంలో ఒక కుటుంబానికి చెందిన ఓటర్లను అంతా ఒక వార్డు పరిధిలోకే వచ్చేలా విభజన చేయనున్నారు. ఈ క్రమంలో రెండు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఆశా, గ్రామ పంచాయతీ సిబ్బంది సమన్వయం చేసుకొని జాబితా తయారు చేయా లని సూచించా రు. ఓటరు లిస్ట్‌లో కుటుంబ సభ్యులం తా ఒకే వరుస క్రమంలో ఉం డేలా చూసుకోవాలని ప్రభుత్వం సూచించి ంది. ఇందు కోసం ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్‌ను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఆ సాఫ్ట్‌వేర్ ద్వారా వార్డుల విభజన చేయనున్నారు. కాగా.. వార్డుల విభజనకు ప్రభుత్వం ఎలాంటి గడువు విధించలేదు.

### మూడు విడతలుగా ఎన్నికలు..

గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, సర్పం చి ఎన్నికలను మూడు విడతలుగా ప్రభుత్వం నిర్వహించనుంది. ఒకే సారి ఎన్నికలు నిర్వహిం చేందుకు సిబ్బంది సరిపడకపోవ డంతో మూడు విడతలుగా ఎన్నికలను నిర్వహిస్తుంటారు. జిల్లాలో 281 గ్రామ పంచాయతీలు, 2564 వార్డులకు ఎన్నికలు జరుగు తాయి. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సిబ్బంది కేటాయింపుపై ఎన్నికల సంఘం గతంలోనే మార్గద ర్శకాలు జారీ చేసింది. వాటి ప్రకారం.. ఒక్కో వార్డుకు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఓటర్ల ప్రాతిపదికన పోలింగ్ కేంద్రాలకు ప్రిసై డింగ్ అధికారి, పోలింగ్ అధికారులను కేటాయించనున్నారు. 200 ఓట్ల లోపు ఉన్న పోలింగ్ కేంద్రాలకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక పోలింగ్ అధికారి, 200-400 ఓట్లు ఉన్న కేంద్రాలకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు, 650 పైన ఓట్లు ఉన్న కేంద్రాలకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులు విధులు నిర్వర్తించనున్నారు. 650 ఓట్లు పైన ఉన్న గ్రామాల్లో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం గత ఏడాది డిసెంబరులో సూచించింది.

# ఎస్సీ రిజర్వేషన్లను అన్ని రాష్ట్రాలు అమలు చేయాలి

- నాలుగు రాష్ట్రాల సిఎంలు ఇప్పటికే ముందుకు వచ్చారు
- రిజర్వేషన్ల అమలుకు ప్రధాని మోడీ నిర్దుష్ట హామీ
- రిజర్వేషన్లు అన్ని కుటుంబాలకు అందుబాటులోకి రావాలి
- ఢిల్లీలో మీడియాతో మందకృష్ణ మాదిగ



న్యూఢిల్లీ,ఆగస్ట్10(నమస్తే ఉదయం): ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలుకు రాష్ట్రాలు త్వరగా ముందుకు రావాలని ఎమ్మార్పీఎస్ వ్యవ స్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఈ రిజర్వేషన్ల వర్గీకరణపై ప్రధాని మోదీ నిర్దిష్టంగా హామీ ఇచ్చారని చెప్పారు. దిల్లీలో మందకృష్ణ మీడియాతో మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీ కరణ సాకారంలో మోదీ, అమిత్‌షా పాత్ర ఎంతో ఉంది. ప్రధాని, కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమ లుకు రాష్ట్రాలు త్వరగా ముందుకు రావాలి. వర్గీ కరణ డిమాండ్ ఉన్న ప్రతి రాష్ట్రంలో ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలి. వెంటనే అమలయ్యేలా రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించాలని మోదీకి విజ్ఞప్తి చేశా. సుప్రీంకోర్టు ధర్మాసనంలోని ప్రతి జడ్జికీ పేరుపేరునా ధన్యవాదాలు. రాజ్యాంగం అమలు లోకి వచ్చి 70 ఏళ్లు దాటినా రిజర్వేషన్ల ఫలాలు చాలా కుటుంబాలకు అందలేదు. వర్గీకరణకు మద్ద తుగా నిలిచిన ప్రతి నాయకుడికీ కృతజ్ఞతలు చెబు తున్నా. ఎస్సీ వర్గీకరణను దక్షిణాదిలో నలుగురు సీఎంలు వెంటనే స్వాగతించారు. సుప్రీంకోర్టు తీర్పుపై ఏపీ సీఎం చంద్రబాబు ముందుగానే స్పందించి స్వాగతిస్తున్నట్లు చెప్పారని మందకృష్ణ మాదిగ అన్నారు. గతంలో నారా చంద్రబాబు నాయుడు ఎస్సీ వర్గీకరణ అమలు చేశారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. శుక్రవారం జరిగిన టీడీపీ పొలిట్‌బ్యూరో సమావేశంలో కూడా ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తా మని ముఖ్యమంత్రి చంద్రబాబు మిగతా.. 2లో

# వయనాడ్ బాధితులకు అండ

- క్షతగాత్రులకు మోడీ పరామర్శ
- ఏరియల్ సర్వే ద్వారా విలయ ప్రాంత వీక్షణం
- సిఎం పినరయ్‌తో కలసి సమీక్ష
- అన్ని విధాలుగా అండగా ఉంటామని ప్రధాని హామీ



తిరువనంతపురం,ఆగస్ట్10(నమస్తే ఉదయం): కేరళలో ప్రకృతి ప్రకోపానికి బలైన వయనాడ్ బాధితులకు అండగా ఉంటామని ప్రధాని మోడీ ప్రకటించారు. వారికి తగి సహాయం అందిస్తామని అన్నారు. వయనాడ్ విలయ ప్రాంతంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటించారు. భారీ వర్షాలు, వరదలతో కొండచరియలు విరిగిపడిన ఘటనలో బాధితులు, ప్రాణాలతో బయటపడిన వారిని మోదీ పరామర్శించారు. అనంతరం కేరళ సీఎం పినరయి విజయన్, గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్, కేంద్రమంత్రి సురేష్ గోపి, ఇతర యవనాడ్ ఉన్నతాధికారులతో ప్రధాని సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లా డుతూ..వయనాడ్‌లో కొండచరియలు విరిగి పడినప్పటి నుంచి ఘటనకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నట్లు చెప్పారు. ఈ విపత్తులో వందలమంది తమ సర్వస్వాన్ని కోల్పోయారని అన్నారు. ప్రకృతి విలయంలో వాళ్ల కలలన్నీ కల్లలైపోయాయని అన్నారు. ఈ దుఃఖ సమయంలో మీకు అండగా ఉంటామని బాధితులకు మిగతా.. 2లో



అధికారులతో హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్

## రియల్టర్లు, బిల్డర్లు బఫర్ జోన్లు, ఎఫ్.టి.ఎల్ పరిధిలో నిర్మాణాలు కొనసాగిస్తే చర్యలు తప్పవు

– హైడ్రా కమిషనర్ ఎ. వి రంగనాథ్

రాజేంద్రనగర్, ఆగస్టు10 (నమస్తే ఉదయం): ట్రై సిటి పరిధిలో చెరువులకు సంబంధించిన బఫర్ జోన్లు, ఎఫ్.టి.ఎల్ పరిధిలో రియల్టర్లు, బిల్డర్లు అక్రమ నిర్మాణాలు చేపడితే వాటిని చట్టపరంగా కూల్చివేయబడుతుందని హైడ్రా కమిషనర్ ఎ. వి. రంగనాథ్ తెలిపారు. అలాంటి నిర్మాణాలు చేపట్టేందుకుగాను ఎవరైనా ప్రభుత్వ అధికారులు, వ్యక్తులుగాని బిల్డర్లకు, రియల్టర్లకు సహకరించినట్లుయితే

వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోబడుతాయన్నారు.

చెరువు పరిసరాల్లో ఇంటి స్థలాలు, అపార్ట్మెంట్లు, వ్యక్తిగత ఇండ్ల సంబంధించిన స్థిరాస్తులను కొనుగొలు చేసేముందుగా ప్రజలు అప్రమత్తంగా వుండాలన్నారు. ముఖ్యంగా చెరువు పరిసర ప్రాంతాల్లో తక్కువ ధరకు ఇంటి స్థలాలు, అపార్ట్మెంట్లు లభిస్తున్నాయని వాటిని కొనుగోలు చేయడం ద్వారా ప్రజలే నష్టపోతారన్నారు. చెరువుల పరిసరాల్లో స్థిరాస్తులు కొనుగొలు చేసే ముందు ప్రజలు తాము కొనుగొలు చేస్తున్న స్థిరాస్తులు కాని, నిర్మాణం చేపడుతున్న ఇండ్లు చెరువుకు 30 మీటర్ల బఫర్ జోన్ పరిధిలో వుందా లేదా అనేది తెలుసు కోవాల్సి వుంటుందన్నారు. ఈ విషయంపై ప్రజలకు ఎదైనా అనుమానాలు సందేహాలు వుంటే హైడ్రా కార్యాలయములో సంప్రదిం చవచ్చున్నారు.

ఈ సమాచారానికి సంబంధించి త్వరలో ప్రజలకు ఆర్థమయ్యే భాషాలో ప్రజలను అప్రమత్తం చేసే విదంగా వెబ్ సైట్ అందుబాటులో వుంచబడుతుందని హైడ్రా కమిషనర్ ప్రజలకు సూచించారు. చెరువులకు సంబంధించిన బఫర్ జోన్ల పరిధిలో ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టిన, ప్రస్తుతం చేపడుతున్న వీటికి సంబంధించి స్థానిక ప్రజలతో పాటు స్వచ్ఛంధ సంస్థలు హైడ్రా అధికారులకు వాట్సాప్ నెంబర్ 9000113667కు సమాచారం అందించా ల్సిందిగా హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ప్రజలకు తెలిపారు.

## ప్రాజెక్టులు నిండుకోవడంతో ప్రభుత్వం అప్రమత్తం

- అన్నింటా జల విద్యుత్ ఉత్పత్తిని పెంచండి
- అధికారులతో డిప్యూటి సిఎం భట్టి సమీక్ష



హైదరాబాద్,ఆగస్ట్10(నమస్తే ఉదయం): జల విద్యుత్ కేంద్రాల్లో గరిష్ఠ విద్యుత్ ఉత్పత్తికి చీఫ్ ఇంజినీర్లు చర్యలు చేపట్టాలని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాలతోపాటు పలు ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నందున వీలైనంత ఎక్కువ ఉత్పత్తిపై థర్మల్, హైడల్ ప్రాజెక్టుల సీఈలు దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఈ సంద ర్భంగా ఆయన థర్మల్, హైడల్ విద్యుత్ ఉత్పాదకతకు సంబంధించి మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో ఆ శాఖల సీఈలతో సమీక్షా సమావేశం నిర్వహిం చారు. సమావేశంలో అధికారులకు పలు సూచనలు చేశారు. థర్మల్ పవర్ ప్రాజె క్టులకు సంబంధించి ప్రతిప్లాంట్‌లో కనీసం 17రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు అందు బాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధి కారులను ఆదేశించారు. ప్రజల అవసరాలు తీర్చేందుకు నిబద్ధతతో పని చేయాలని స్పష్టం చేశారు. పనిలో నిర్లక్ష్యం, అలసత్వాకి తావు లేదని హెచ్చరించారు. విద్యుత్ శాఖ అంటేనే ప్రజల కోసం నిరంతరం పనిచేసే శాఖ అని చెప్పుకొచ్చారు. 24/7 పని చేయాల్సిన అత్యవసర శాఖ అనే విషయాన్ని అధికారులు, సిబ్బంది గుర్తుపెట్టుకోవాలని హితవుపలికారు. విద్యుత్ ఉత్పత్తిలో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసు కోవాలని, నిర్దేశిత మిగతా.. 2లో




## ఫైలేరియా, నులిపురుగుల నిర్మూలనకు కృషి

- ఫైలేరియా రహితంగా తెలంగాణ అభివృద్ది
- కేంద్రమంత్రితో వర్చువల్ మీటింగ్‌లో దామోదర

హైదరాబాద్,ఆగస్ట్10(నమస్తే ఉదయం): అసలే వర్షాకాలం కావడంతో రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు విజృం భిస్తున్నాయి. వ్యాధుల నివారణపై చర్చించడానికి కేంద్ర మంత్రితో రాష్ట్ర మంత్రి వర్చువల్‌గా సమావేశం మిగతా.. 2లో

## మహిళలకు ఆర్టీసీ శుభవార్త

- కార్గో సర్వీసుల్లో రాఖీల డోర్ డెలివరీ

హైదరాబాద్,ఆగస్ట్10(నమస్తే ఉదయం): ఈ నెల 19వ తేదీన రాఖీ పండుగ నేపథ్యంలో టీజీఎస్ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. రాఖీ పండుగకు నాలుగైదు రోజుల ముందు నుంచి కార్గో సెంటర్లలో ప్రత్యేక కౌంటర్లు తెరిచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.దూర ప్రాంతాల్లో ఉన్న తమ సోదరులకు సోదరీమణులు రాఖీలు పంపేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు. రాఖీలతో పాటు స్వీట్ బాక్సులు, బహుమతులు, ఇతర సామగ్రిని కూడా పంపే అవకాశం కల్పించారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మిగతా.. 2లో






## మేఘాకు దోచిపెడుతున్న సిఎం రేవంత్

- సుంకిశాల కూలి పదిరోజులైనా పట్టింపేది
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపణలు

హైదరాబాద్,ఆగస్ట్10(నమస్తే ఉదయం): కాంట్రాక్టుల పేరుతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంట్రాక్టర్ మేఘా కృష్ణారెడ్డికి రాష్ట్ర సంపద దోచి పెడుతున్నారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. నాసిరకం పనులు చేస్తుందంటూ మేఘా కంపెనీకి కేంద్ర ప్రభుత్వం షోకాజ్ నోటీసులు ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. సుంకిశాల ప్రాజెక్టు కూలిపోయి 10రోజులు గడిచినా కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి రాలేదా అంటూ ఆయన మండిపడ్డారు. సుంకి శాల పనులు మేఘా కంపెనీయే చేసిందని, అలాం టిది కొడంగల్‌లో చేయబోతే పనులను సైతం ముఖ్యమంత్రి అదే కంపెనీకి ఇవ్వబోతున్నట్లు మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో మేఘా కృష్ణారెడ్డిపై సీఎం రేవంత్ రెడ్డి సీబీఐకి ఫిర్యాదు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడేమో క్రిమినల్ కాంట్రాక్టర్ మేఘా కృష్ణారెడ్డికే సీఎం దోచిపెడుతున్నారంటూ సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణలో గొర్రెలను తినేటోడు పోయి.. బర్రెలను తినేటోడు వచ్చాడని బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి అన్నారు.

మాజీ ముఖ్య మంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దోచుకున్న అవినీతి సొమ్ములో రేవంత్ రెడ్డి వాటా అడుగుతున్నట్లు స్పష్టంగా తెలు స్తోందని చెప్పుకొచ్చారు. వీరిద్దరికి మధ్యవర్తిగా కాంట్రాక్టర్ మేఘా కృష్ణారెడ్డి సెటిల్మెంట్ చేస్తు న్నట్లు బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి ఆరో పించారు.





మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ సతీమణి,జమున హచరిస్ అధినేత ఈటెల జమున జన్మదినం సందర్భంగా ఆమె చేత కేక్ కట్ చేస్తున్న నాయకులు, అభిమానులు,

జమునకు స్వీట్ తినిపిస్తున్న బిజెపి రాష్ట్ర నాయకురాలు కొమిరెడ్డి ఉమామహేశ్వర్ రెడ్డి

# ఘనంగా ఈటల జమున జన్మదిన వేడుకలు


మల్కాజిగిరి, ఆగస్టు 10(నమస్తే ఉదయం): మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ సతీమణి, జమున హాచరిస్ అధినేత ఈటెల జమున జన్మదిన వేడుకలు షామీర్‌పేటలోని ఆమె స్వగృహంలో పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. శనివారం బిజెపి రాష్ట్ర నాయకురాలు కొమిరెడ్డి ఉమామహేశ్వర్ రెడ్డి నేతృత్వంలో అధిక సంఖ్యలో మహిళ నాయకురాలు జమున హచరిస్ అధినేత ఈటల జమున జన్మదిన వేడుకలను పురస్కరించుకుని కేక్ కట్ చేయించి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఓల్డ్ అల్వాల్ శ్రీ లక్ష్మీ నగర్‌లో
# డ్రైనేజీ సమస్య పరిష్కరించండి

### కాలనీవాసులు మైనంపల్లికి విజ్ఞప్తి

### డ్రైనేజి సమస్యపై జలమండలి ఎండితో మాట్లాడిన మైనంపల్లి

మల్కాజిగిరి, ఆగస్టు 10(నమస్తే ఉదయం): ఓల్డ్ అల్వాల్ శ్రీ లక్ష్మీ నగర్ కాలనీలో డ్రైనేజ్ లైన్ పాతది కావటంతో లీక్ అవుతుందని కాలనీవాసులు శనివారం మల్కాజిగిరి కాంగ్రెస్ ఇంచార్జ్ మైనంపల్లి హనుమంతరావు కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీ లో రెండు మూడు



డ్రైనేజీ సమస్యపై మల్కాజిగిరి అసెంబ్లీ కాంగ్రెస్ ఇన్చార్జి మైనంపల్లితో సమావేశమైన స్థానికులు

రోజులకు ఒక సారి డ్రైనేజీ లీకేజీ కావడం వల్ల కాలనీవాసులం తీవ్ర ఇబ్బందుల గురవుతున్నామని ఆయనకు వివరించారు. మైనంపల్లి హన్మంతరావు వెంటనే స్పందించి జలమండలి అధికారులచే సర్వే చేయించి అంచనాలు రూపొందించారు. కాలనీలో నూతనంగా డ్రైనేజీ పైపులు ఏర్పాటు చేయటానికి జలమండలి అధికారులు రూపొందించిన అంచనాల వివరాలను సైనిక్ పురి జలమండలి డివిజన్ అధికారులు మంజూరి కొరకు యం డి జలమండలి ఎండి అశోక్ రెడ్డి తో మైనంపల్లి హనుమంతరావు శనివారం ఫోన్ లో మాట్లాడి మంజూరి చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి స్పందించి మంజూరి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు బి.నాగేశ్వర్ రావు గారు, ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి, సెక్రటరీ శ్రీకాంత్ రావు, సాయిరాం గౌడ్, నారాయణ, మధుకర్, అనిల్, మహేందర్ , సీనియర్లు నరహరి రావు , జైపాల్ రెడ్డిలు పాల్గొన్నారు.

## ప్రాజెక్టులు నిండుకోవడంతో
# ప్రభుత్వం అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)

లక్ష్యాలను సాధించేందుకు అనుగుణంగా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని భట్టి విక్రమార్క అధికారులకు చెప్పారు. సకాలంలో నిర్ణయాలు తీసుకోకపోవడం వల్లే గతంలో శ్రీశైలం, జూరాల వంటి హైడల్ విద్యుత్ ప్రాజెక్టుల్లో సాంకేతిక సమస్యలు తలెత్తాయని, తద్వారా ఏర్పడిన నష్టం గురించి అధికారులకు వివరించారు. ఇకపై నిర్ణయాలు తీసుకోవడంలో అలాంటి పరిస్థితి పునరావృతం కాకూడదని చెప్పారు. ఇందుకుగాను వారానికి ఒకసారి విద్యుత్ కేంద్రాల పరిస్థితి, ఉత్పాదకతకు సంబంధించిన నివేదికలు తనకు పంపాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు.

విద్యుత్ శాఖలో పని చేసే ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు ఉన్నా వినేందుకు, పరిష్కరించేందుకు తాను 24గంటలూ అందుబాటులో ఉంటానని డిప్యూటీ సీఎం భట్టి చెప్పారు. ఒకవేళ తాను అందుబాటులో లేకుంటే సమస్యలను విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రాజెక్టులకు సంబంధించి సీఈలు నిర్లక్ష్యం వహించినట్లుగా ఉంటే రాతపూర్వకంగా వారి నుంచి వివరణ తీసుకోవాలని డిప్యూటీ సీఎం ఉన్నతాధికారు లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశానికి ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్ కో జేఎమ్డీ శ్రీనివాస్, ఎనర్జీ ఓఎస్డీ సురేందర్ రెడ్డి, జెన్కో డైరెక్టర్లు, సీఈలు హాజరయ్యారు.

# మహిళలకు ఆర్టీసీ శుభవార్త

(మొదటి పేజీ తరువాయి)

కర్ణాటక తదితర రాష్ట్రాలకు రాఖీలను పంపించుకోవచ్చని పేర్కొన్నారు. ఇందుకోసం అన్ని బస్టాండ్లలోని కార్గో సెంటర్లలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్గో సెంటర్లలో బుక్ చేసిన 24 గంటల్లోనే రాఖీలను డెలివరీ చేసే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. కార్గో అధికారులు కౌంటర్లు తెరవడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, రాఖీల రవాణా ధర ఇంకా ఖరారు కాకపోవడంతో ఉన్నతాధికారుల అనుమతి కోసం వేచి ఉన్నారు. రాఖీల రవాణకు సంబంధించిన ధరల విషయంలో సోమవారం స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



బంరుఖ్ దవుల చెరువులో ఎఫ్‌టిఎల్‌లో నిర్మించిన అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న హైడ్రా అధికారులు

# భూకబ్జాదారులను వెంటనే అరెస్టు చేయాలి

### ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి

రాజేంద్రనగర్, ఆగస్ట్ 10(నమస్తే ఉదయం): ప్రభుత్వ భూములు, చెరువులు కబ్జా చేసిన వారిని అరెస్టు చేసి అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని ఏఐటియుసి కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు.

శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి లో గల చారిత్రాత్మక బామ్రుక్ దౌల చెరువులో హైడ్రా అధికారులు కూల్చివేయడాన్ని ఆయన పూర్తిగా ఈ చెరువు కబ్జా విషయంపై రాజేంద్రనగర్ మున్సిపల్ సర్కిల్ పరిధిలో మున్సిపల్ అధికారులు పోలీసులు శనివారం శివరాంపల్లి నేషనల్ పోలీస్ అకాడమీ ఎదురుగా ఉన్న బమ్ రుక్నాథ్ దౌల చెరువు సికం భూమి ప్రభుత్వ భూమి లో 2007లో 60 గజాల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని భూ పోరాటం చేయడం జరిగిందని గుర్తు చేశారు. కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని గుడిసెలు వేయడం జరిగిందన్నారు. అపుడు ఉన్న అధికారులు నేషనల్ హైవే ఆనుకొని ఉన్న ప్రహరి గోడను ఇప్పుడు డీసీపీ చింతమనేని శ్రీనివాస్ కూల్చివేసి కమ్యూనిస్టు పార్టీ నాయకులు వనంపల్లి జైపాల్ రెడ్డి తో పాటు 6 మంది మీద ల్యాండ్ గ్రాఫింగ్ కేసులు నమోదు చేశార న్నారు. తాము పేదల కోసం పనిచేస్తే తమపై కేసులు నమోదు చేయడం వల్ల ఇప్పటికీ ఫోటోలు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ నిజంగా కబ్జాలు చేసి వెంచర్లు వేసి భూకబ్జా చేసిన వారిపై పోలీసులు,రెవిన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు ఎలాంటి కేసులు పెట్టకుండా చోద్యం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు చెరువులను కబ్జా చేసిన వారిని ల్యాండ్ గ్రాఫింగ్ కేసులు పెట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జైపాల్ రెడ్డి కోరారు.

# 'పంచాయతీ' పోరుకు కసరత్తు ముమ్మరం

(మొదటి పేజీ తరువాయి)

### ఫిబ్రవరి 1తో పదవీకాలం పూర్తి

– 2024 ఫిబ్రవరి 1తో సర్పంచులు, వార్డు సభ్యుల పదవీకాలం ముగిసింది. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం పదవీకాలం పూర్తి అయ్యే లోపే ఎన్నికలు పూర్తి చేయాల్సి ఉంటుంది. 2019 జనవరిలో నెలలో జనగామ జిల్లాలోని పంచాయతీలకు ఎన్నికలు జరగగా ఐదేళ్ల తర్వాత సరిగ్గా అదే జనవరిలోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. కానీ.. అసెంబ్లీ ఎన్నికలు, కొత్త ప్రభుత్వం కావడంతో పంచా యతీ ఎన్నికల నిర్వహణ సాధ్యం కాలేదు. ఆ తర్వాత పార్ల మెంట్ ఎన్నికలు రావడంతో మరింత ఆలస్యం అయింది. కాగా.. ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లాల అవసర మయ్యే పోలింగ్ సిబ్బంది, గత ఎన్నికల్లో ఓటర్లు, ప్రస్తుత ఓటర్లు, గత ఎన్నికల సందర్భంగా వార్డులకు, సర్పంచి పదవి ఉన్న రిజర్వేషన్ ఏంటన్న అంశాలపై ఎన్నికల సంఘం కలెక్టర్ల నుంచి గత ఏడాది డిసెంబరులోనే నివేదిక కోరింది. దీంతో జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులను శాఖల వారీగా, పే స్కేల్ వారీగా వర్గీకరణ చేసి 'తెలంగాణ–పోల్'(టీఈ–పోల్) వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేశారు. ఉద్యోగుల వివరాలతో పాటు 2009, 2014, 2019 పంచాయతీ ఎన్నికల్లో వార్డులు, గ్రామాల వారీగా కేటాయించిన రిజర్వేషన్ వివరాలను ఈనెల 30లోగా 'పీపీఆర్ఎస్' మాడ్యూల్‌లో గత ఏడాది పొందు పరిచారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి సైతం ఎన్నికల నిర్వ హణపై ఆదేశాలు ఇవ్వడంతో పంచాయతీ ఎన్నికలు త్వర లోనే జరగనున్నాయనే ప్రచారం జరుగుతోంది. సెప్టెంబరు మొదటి వారంలో షెడ్యూల్ వచ్చి సెప్టెంబరు మూడో వారంలో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని పలువురు భావి స్తున్నారు. దీనిపై ప్రభుత్వం నుంచి అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది.

# స్పీకర్ ప్రసాద్‌కుమార్‌పై అనుచిత పోస్టులు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. విజయ్ కుమార్ ఎవరు చెబితే ఈ పోస్టులను వైరల్ చేశారన్న అంశంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో మరికొంత మందిని పోలీసులు అరెస్ట్ చేసే అవకాశాలు ఉన్నాయి.

# ఎస్సీ రిజర్వేషన్లను అన్ని రాష్ట్రాలు అమలు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారని సంతోషం వ్యక్తం చేశారు. ఆయనను కలిసి ధన్యవాదాలు తెలుపుతామన్నారు. విదేశీ పర్యటన నుంచి రాగానే సీఎం రేవంత్ రెడ్డిని కూడా కలిసి ధన్యవాదాలు చెబుతామని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. కాగా మందకృష్ణ మాదిగ శుక్రవారం రాత్రి ఢిల్లీలో ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో వారిని కలిసారు. . దాదాపు 30 నిమిషాలపాటు ప్రధానితో భేటీ అయిన మందకృష్ణ ఎస్సీ వర్గీకరణకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే, మంద కృష్ణను ఆప్యాయంగా పలకరించి హత్తుకున్న ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ. తెలుగు రాష్ట్రాల్లో వర్గీకరణ త్వరితగతిన అమలు అయ్యేలా చూడాలని కోరారు. వర్గీకరణ అంశంపై కొందరు సుప్రీం కోర్టుకు వెళ్లే ఆలోచనలో ఉన్న నేపథ్యంలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణకు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుగ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన రిజర్వేషన్లను ఉప వర్గీకరణ చేసే అధికారం.. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందని సుప్రీంకోర్టు తీర్పును వెలువరించింది.

# వయనాడ్ బాధితులకు అండ

(మొదటి పేజీ తరువాయి)

చెప్పినట్లు తెలిపారు. 'ఈ రోజు నేను రిలీఫ్ క్యాంపులో బాధితులను స్వయంగా కలిశాను. గాయపడిన వారిని ఆసుపత్రిలో పరామర్శించాను. వారు చాలా కష్ట పరిస్థితిలో ఉన్నారు. వయనాడ్ విలయంలో చిక్కుకున్న వారికి అండగా నిలవాలి. అంతా కలిసి పనిచేస్తేనే బాధితులకు అ అండ దక్కగలదు. ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు అంతా కలిసి పనిచేయాలి. ఆప్తులను కోల్పోయిన వారికి అండగా నిలుద్దాం. రాష్ట్ర ప్రభుత్వం నష్టం అంచనాలు పంపిన వెంటనే ప్రకృతి విపత్తు సాయం అందిస్తాం అన్నారు. సంఘటన జరిగిన రోజు ఉదయం నేను సిఎం పినరయి విజయన్‌తో మాట్లాడాను. మేము సహాయం అందజేస్తామని, వీలైనంత త్వరగా సంఘటనా స్థలానికి చేరుకోవడానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చాను. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్. సైన్యం, పోలీసులు, వైద్యులు, ప్రతి ఒక్కరూ బాధితులకు వీలైనంత త్వరగా సహాయం చేయడానికి ప్రయత్నించారు. మృతుల కుటుంబీకులు ఒంటరిగా లేరని నేను హామీ ఇస్తున్నాను. వారికి మేము అండగా ఉన్నాం. కేరళ ప్రభుత్వంతోపాటు కేంద్ర ప్రభుత్వం వారికి సాయం చేస్తోందని తెలిపారు. ఢిల్లీ నుంచి విమానంలో కేరళకు బయలుదేరిన ప్రధాని.. ఉదయం 11 గంటలకు కన్నూర్ ఎయిర్ పోర్ట్ కు చేరుకున్నారు. ఆయన్ని కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ రిసీవ్ చేసుకున్నారు. అక్కడ నుంచి ఓ ప్రత్యేక విమానంలో వయనాడ్ బయలుదేరారు. కొండచరియలు సంభవించిన చూరల్ మలా, మండక్కై ప్రాంతాలలో ఏరియల్ సర్వే నిర్వహించారు. రెస్క్యూ ఆపరేషన్, సహాయక చర్యలు, పునరావాస కేంద్రాల గురించి అధికారులను ప్రధాని మోదీ అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధితులను కలుసుకోని మాట్లాడారు. వయనాడ్ ప్రాంతంలో ప్రకృతి విళయ తాండవం వల్ల జరిగిన నష్టాన్ని పరిశీలించారు. అధికారులతో కేంద్ర సహాయం గురించి చర్చించారు. ఆస్పత్రిలో క్షతగాత్రులను కలుసుకున్నారు. తర్వాత ప్రాణాలతో బయటపడిన వారిని కలిసి కొండచరియల విధ్వంసం గురించి తెలుసుకోనున్నారు. ఆయనతోపాటు కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్, ప్రభుత్వ అధికారులు ఉన్నారు.

## పైలేరియా, నులిపురుగుల
# నిర్మూలనకు కృషి

(మొదటి పేజీ తరువాయి)

అయ్యారు. పైలేరియా, నులిపురుగుల నిర్మూలనకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ ఈ సందర్భంగా పేర్కొన్నారు. జాతీయ పైలేరియా, నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి ప్రతాప్ రావు జాదవ్ అధ్యక్షతన నిర్వహించిన వర్చువల్ కార్యక్రమంలో దామోదర్ శనివారం పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయం నుంచి దామోదర్ ఇందులో పాల్గొన్నారు. వీటి నిర్మూలన కోసం సంగారెడ్డి, మహబూబాబాద్ జిల్లాలలో 14 ఆరోగ్య కేంద్రాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.తెలంగాణలో పైలేరియా, నులిపురుగుల నివారణకు చేపడుతున్న చర్యలను దామోదర్.. కేంద్రమంత్రికి వివరించారు. సంగారెడ్డి, మహబూబాబాద్ జిల్లాలో 14 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ప్రజలకు బోదకాలు వ్యాధి, నులిపురుగుల నివారణకు ఆగస్టు 10 నుంచి మందులుపంపిణీ చేస్తున్నట్లు మంత్రి వివరించారు. ఇందుకుగానూ 2,600 మంది సిబ్బందికి శిక్షణ ఇచ్చి ఇందులో భాగస్వామ్యం చేశామన్నారు. అలాగే 2,522 మంది డ్రగ్ అడ్మినిస్ట్రేటర్లు క్షేత్రస్థాయిలో సేవలందిస్తారని మంత్రి వెల్లడించారు. ఈ సందర్భంగా నివారణకు చేపడుతున్న కార్యక్రమాలపై అవగాహనపత్రాలను, బ్రోచర్లను ఆయన ఆవిష్కరించారు. తెలంగాణను పైలేరియా నిర్మూలన రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. వర్చువల్‌గా జరిగిన ఈ కార్యక్రమంలో బిహార్, జార్ఖండ్, కర్ణాటక, ఒడిశా, తెలంగాణ, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల ఆరోగ్య శాఖ మంత్రులు పాల్గొనగా.. తెలంగాణ నుంచి ప్రభుత్వ కార్యదర్శి డా. క్రిస్టినా ఉన్నారు.

# మాల్దీవుల పర్యటనలో విదేశాంగ మంత్రి జైశంకర్

### అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జుతో భేటీ

న్యూఢిల్లీ,ఆగస్ట్10(నమస్తే ఉదయం): మాల్దీవుల పర్యటనలో ఉన్న భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్.. ఆ దేశ అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారిద్దరూ అనేక అంశాలపై చర్చలు జరిపారు. మూడు రోజులపర్యటనలో భాగంగా ఆగస్టు 11వరకు అక్కడే ఉండనున్న ఆయన.. ఇరు దేశాల ద్వైపాక్షిక అంశాలపై చర్చించనున్నారు. చివరిసారిగా 2023 జనవరిలో జైశంకర్ అక్కడ పర్యటించిన విషయం తెలిసిందే.భేటీకి సంబంధించి 'ఎక్స్'లో స్పందించిన జైశంకర్.. అధ్యక్షుడు డాక్టర్ మొహమ్మద్ ముయిజ్జుతో భేటీ కావడం విశేషమన్న ఆయన.. భారత ప్రధాని మోదీ తరపున శుభాకాంక్షలు తెలియజేసినట్లు వివరించారు. తమ ప్రజలు, ఈ ప్రాంత ప్రయోజనాల కోసం భారత్–మాల్దీవుల మధ్య సంబంధాలను బలోపేతం చేసేందుకు ఇరు దేశాలు కట్టుబడి ఉన్నాయన్నారు. అనంతరం ముయిజ్జు మాట్లాడుతూ.. తమ మిత్రదేశాల్లో భారత్ ఎల్లప్పుడూ ఉంటుందని.. మాల్దీవులకు అవసరమైనప్పుడల్లా సహాయాన్ని అందిస్తుందని అన్నారు.

# 17 నెలల తరవాత టీ తాగుతున్నా

### భార్యతో కలిసి టీ తాగుతున్న ఫోటో విడుదల

### రాజ్‌ఘాట్‌లో మహాత్ముడికి నివాళి

### హనుమాన్ దేవాలయంలో పూజలు

### ఆప్ నేత మనీష్ సిసోడియా దినచర్య ప్రారంభం

న్యూఢిల్లీ,ఆగస్ట్10(నమస్తే ఉదయం): ఆలస్యంగానైనా నిజాయితీ, సత్యమే గెలిచాయని ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా అన్నారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో అరెస్టయ్యి 570 రోజులకుపైగా జైల్లో ఉన్న మనీశ్‌సిసోడియాకు బెయిల్ లభించడంతో.. శుక్రవారం ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. శనివారం ఉదయాన్నే కన్నాట్ ప్లేస్‌లోని హనుమాన్ దేవాలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మనీశ్‌సిసోడియాతో పాటు పలువురు ఆప్ నేతలు కూడా ఉన్నారు. సిసోడియా మాట్లాడుతూ.. భజరంగ్ బలి ఆశీర్వాదం తోనే తాను జైలు నుంచి బయటకు వచ్చానని చెప్పారు. త్వరలో సీఎం కేజ్రీవాల్ కూడా భజరంగ్ ఆశీర్వాదంతో జైలు నుంచి విడుదలవుతారని అన్నారు. ఆ తర్వాత సిసోడియా సహా ఆప్ నేతలంతా మహాత్మాగాంధీ స్మారకమైన రాజ్‌ఘాట్‌కు వెళ్లి గాంధీజీకి నివాళులు అర్పించారు. ఆ తర్వాత ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ హెడ్‌క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిసోడియా మాట్లాడుతూ..

ఆలస్యమైనా ఆఖరికి నిజాయితీ, సత్యమే గెలిచాయని వ్యాఖ్యానించారు. ఈ కష్టకాలం తనకు మానసికంగా మరింత బలాన్నిచ్చిందని సిసోడియా చెప్పారు. ఓ ఏడెనిమిది నెలల్లో తనకు న్యాయం జరుగుతుందని భావించానని, కానీ 17 నెలల కాలం పట్టిందని అన్నారు. ఆలస్యమైనా సత్యమే గెలువడం సంతోషకరమని చెప్పారు. ఈ కష్టకాలం తనకు మానసికంగా మరింత బలాన్నిచ్చిందని సిసోడియా చెప్పారు. బీజేపీ ప్రభుత్వ నియంతృత్వ పోకడలపై ప్రతిపక్ష కూటమి ఏకతాటిపైకి వచ్చి పోరాడాల్సిన అవసరం ఉందని సిసోడియా అన్నారు. ఇవాళ జైల్లో ఉన్నది ఆప్ కార్యకర్తలు, నేతలేగదా మనకెందుకు అనుకుంటే..రేపు మీ వంతు కూడా రావచ్చని వ్యాఖ్యానించారు. అందరం ఒక్కతాటిపైకి వచ్చి పోరాడితే నియంతృత్వం అంతమ వుతుందని, కేజ్రీవాల్ కేవలం 24 గంటల్లోనే జైలు నుంచి బయటికి వస్తాడని అన్నారు. ఇకపోతే మనీలాండ రింగ్‌తో ముడిపడిన దిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన దిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోదియా 17 నెలల తర్వాత జైలు నుంచి విడుదలయ్యారు. ఈ సందర్భంగా ఆయన శనివారం ఉదయం తొలిపోస్టు పెట్టారు. ఇంట్లో తన సతీమణితో కలిసి టీ తాగుతున్న చిత్రాన్ని షేర్ చేశారు. 17 నెలలకు లభించిన స్వేచ్ఛ తర్వాత ఉదయం ఇంట్లో టీ తాగుతున్నాను. భారతీయులందరికీ రాజ్యాంగం స్వేచ్ఛగా జీవించే హక్కు కల్పించింది. ప్రతిఒక్కరితో కలిసి స్వేచ్ఛా వాయువులు పీల్చుకునే హక్కును ఆ దేవుడు మనందరికీ ఇచ్చాడు' అని సిసోదియా పోస్టు పెట్టారు. మద్యం కుంభకోణం కేసులో గతేడాది ఫిబ్రవరి 26న సీబీఐ అధికారులు అప్పటి దిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోదియాను అరెస్టు చేయగా, ఆ తర్వాత కొన్ని రోజులకు ఈడీ కూడా కస్టడీలోకి తీసుకుంది. అరెస్టయిన రెండు రోజుల తర్వాత ఉప



ముఖ్యమంత్రి పదవికి సిసోదియా రాజీనామా చేశారు. అప్పటినుంచి గత 17 నెలలకు పైగా జైల్లోనే ఉన్నారు. ఆయన బెయిల్ అభ్యర్థనలు పలుమార్లు తిరస్కరణకు గురికావడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఏ నిందితుడినీ కాలపరిమితి లేకుండా జైలులో ఉంచలేరు. కేసు విచారణలో పురోగతి లేకపోయినా.. ఒక పరిమితి దాటిన తర్వాత ఆ వ్యక్తిని జైల్లో ఉంచడం సరికాదు. అలాకాదంటే ఆ వ్యక్తి హక్కులను హరించడమే అవుతుంది. బెయిల్‌కు దరఖాస్తు చేసుకోవడం, ఉపశమనం పొందడం నిందితుల హక్కు' అని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. మనీశ్ సిసోదియా సమాజంలో బలమైన సంబంధాలు ఉన్న వ్యక్తి అని, ఆయన విదేశాలకు పారిపోయే అవకాశమే లేదని అభిప్రాయపడింది. సిసోదియా బెయిల్ అభ్యర్థనలను తోసిపుచ్చుతూ మే 21న దిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేసింది. అలాగే కొన్ని షరతులు విధించింది. నిందితుడు తన పాస్‌పోర్ట్‌ను ట్రయల్‌కోర్టుకు అప్పగించాలని, సాక్షులను ప్రభావితం చేయకూడదని ఆదేశించింది. ప్రతి సోమవారం,గురువారం ఉదయం దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకావాలని స్పష్టం చేసింది. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం వల్లే తాను బెయిల్‌పై రాగలిగానని తిహాడ్ జైలు నుంచి వెలుపలికి వచ్చిన సిసోదియా అన్నారు. ఇదే జైలులో ఉన్న దిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ కూడా త్వరలోనే విడుదలవు తారనే ఆశాభావం వ్యక్తంచేశారు. దీనిపై భాజపా స్పందించింది.ఆప్ నేతల విమర్శలపై భాజపా తీవ్రంగా స్పందించింది. బెయిల్ వచ్చిందని మరీ ఆనందపడొద్దని కౌంటర్ ఇచ్చింది. కోర్టు తీర్పులను భాజపా గౌరవిస్తుంది. కానీ, బెయిల్ వచ్చినంత మాత్రాన.. కేసు నుంచి విముక్తి లభించినట్లు కాదు.



వరద బాధితుల కొరకు విరాళాలు సేకరిస్తున్న నాయకులు

## వయనాడ్ వరద బాధితుల కోసం
# విరాళాలు సేకరణ

**కొత్తకోట ఆగస్టు 10( నమస్తే ఉదయం):** కేరళ రాష్ట్రంలో వరదలకు అతలాకుతలమైన వయనాడ్ ప్రాంతాని చెందిన వరద బాధితుల కోసం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో భవన నిర్మాణ సంఘం, మరియు తాపీ కార్మిక సంఘం, ద్వారా శనివారం పట్టణ వ్యాపారస్తుల నుండి



విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్, మాట్లాడుతూ వయానాడ్ భారీ వర్షాల కారణంగా కొండ చర్యలు విరిగిపడి భారీ ప్రాణ,నష్టం ఆస్తి, నష్టం వాటిలిందని ఆ బాధితులను ఆదుకునే బాధ్యత మానవుల మైన మన అందరిపై ఉందని అన్నారు. సేకరించిన విరాళాలను సిఐటియు రాష్ట్ర కమిటీ కి అప్పజెప్తామని చెప్పారు. బాధితుల కొరకు సహాయం చేసిన వ్యాపారస్తులకు సిఐటియు ఆధ్వర్యంలో నిక్సన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాపీ కార్మిక సంఘ జిల్లా నాయకులు పీబి శ్రీను, పి జనార్ధన్, అస్కాని శ్రీనివాసులు, ఆశన్న, మండల అధ్యక్షులు కే వెంకటయ్య, కొత్తకోట అధ్యక్షులు గొల్ల వెంకటయ్య,హమాలి కార్మిక సంఘం అధ్యక్షులు నెల్లూరు కురుమన్న,కోశాధికారి కురుమయ్య, మేస్త్రి సంఘం ప్రచార కార్యదర్శి బాలకృష్ణ,నాగన్న,పెద్ద రాములు,జానారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై సిపిఐ నిరంతర పోరాటం: ఎమ్మెల్యే కూనం నేని

**శంషాబాద్, ఆగస్టు10(నమస్తే ఉదయం):** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రంగారెడ్డి జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం శనివారం శంషాబాద్ కేంద్రంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి




కమ్యూనిస్టు జెండాకు వందనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సాంబశివరావు

కొత్తగూడెం ఎమ్మెల్యే కామ్రేడ్ కూనంనేని సాంబశివరావు సిపిఐ పార్టీ జాతీయ నాయకులు అజిత్ పాషా ముఖ్య అతిథులుగా హాజరై నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు వనంపల్లి జైపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే. కౌన్సిలర్లు...

**శంషాబాద్, ఆగస్టు 10(నమస్తే ఉదయం):** శాతం రాయి గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం అందజేశారు. శాతం రాయి కౌన్సిలర్లు బద్రు నాయక్. సునీత దయానంద ఆధ్వర్యంలో సమక్షంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. వివిధ రకాల ఆనారోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వారికి



ఆర్థిక సహాయంగా సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ద్వారా వీటిని అందజేసినట్లు తెలిపారు. అందజేయడంలో సహకరించిన కౌన్సిలర్ బద్రు నాయక్ కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్ . నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దూడల వెంకటేష్ గౌడ్. భవాని మల్లేష్ . ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నాగుల పంచమి

**గద్వాల,ఆగస్టు10(నమస్తే ఉదయం):** నాగులపంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పలు ఆలయాల ప్రాంగణాల వద్ద, గ్రామశివారులో ఉన్న నాగదేవతల వద్ద భక్తులు పూజలు నిర్వహించి పుట్టలో పాలు పోసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. పాడి పంటలు



బాగా పండాలని, తమను చల్లంగా చూడాలని నాగదేవతకు పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఒడి బియ్యం పోశారు.





ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న అధికారులు, క్షేత్రస్థాయిలో మఠం ఆస్తులను పరిశీలిస్తున్న అధికారులు

## శ్రీ నారదగడ్డ మఠం ఆస్తుల నిర్వహణపై
# ప్రజల అభిప్రాయ సేకరణ...

**హై కోర్టు ఆదేశాల మేరకు కదిలిన యంత్రాంగం**

**భక్తుల అభిప్రాయాలను సేకరించిన రాయచూరు జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ మరియు జిల్లా అధికారులు**

**ఉరవకొండ చెన్న బసవేశ్వర స్వామిని పిఠాధిపతిగా ఉండాలని కోరిన భక్తులు**

**పెద్ద ఎత్తున పాల్గొని మద్దతు తెలిపిన భక్తులు**

**గద్వాల,ఆగస్టు10(నమస్తే ఉదయం):** ధరూర్ మండలంలోని నెట్టెంపాడు గ్రామ సమీపంలో కృష్ణానది మధ్యలో ఉన్న శ్రీ నారదగడ్డ చెన్న బసవేశ్వర స్వామి దేవస్థానానికి పూర్వకాలం నుంచి ఆస్తుల వివాదం నెలకొంది. గత 18 సంవత్సరాల క్రితం కర్ణాటక రాష్ట్రం సిర్వార్ తాలూకా కొటేకల్ మఠం దేవస్థానానికి సంబంధించిన శివకుమార్ అనే స్వామి నారదగడ్డ చెన్న బసవేశ్వర మఠం దేవస్థానానికి నేనే పీఠాధిపతి నని ఆ దేవస్థానకు సంబంధించిన ఆస్తులన్నీ కూడా నాకే చెందుతాయని హైకోర్టులో రిట్ పిటిషన్ నెం. 202656/2014 కేసుకు సంబంధించి కలబురిగి హైకోర్టులో పిటిషన్ వేశారు. రాయచూర్ జిల్లా కలెక్టర్ మరియు తహసిల్దార్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేశాయి. ఈ మేరకు శనివారం కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా కలెక్టర్ నితీష్, అడిషనల్ కలెక్టర్ మహబూబ్



సమావేశంలో పాల్గొన్న ప్రజలు

బీ, తహసీల్దార్ సురేష్ వర్మ మరియు సంబంధిత అధికారులు సూక్షేత్ర శ్రీ నారదగడ్డ చెన్నబసవేశ్వర స్వామి దేవస్థానానికి చేరుకొని ఆస్తుల నిర్వహణపై విచారణ చేపట్టి భక్తుల అభిప్రాయాలను సేకరించారు. ఇందుకు సంబంధించి భక్తులు తమ అభిప్రాయాలను తెలియజేస్తూ కర్ణాటక రాష్ట్రం సిర్వార్ తాలూకా కొట్టేకల్ శివకుమార్ స్వామి వేసిన పిటీషన్ మేము వ్యతిరేకిస్తున్నామని రాయచూరు జిల్లా కలెక్టర్ మరియు సంబందిత అధికారులకు భక్తులు తమ అభిప్రాయాలను తెలిపారు. దీనికి సంబంధించి అనంతపురం జిల్లా ఉరవకొండ చెన్న బసవేశ్వర స్వామినే నారదగడ్డ చెన్న బసవేశ్వర దేవస్థానానికి పీఠాధిపతిగా ఉండాలని వారిని భక్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా రాయచూర్ జిల్లా కలెక్టర్ నితీష్ మాట్లాడుతూ... భక్తుల అభిప్రాయాలను విన్న తర్వాత ఈనెల 8వ తేదీన హైకోర్టులో జరిగే వాదోపవాదనలు సూక్షేత్ర నారదగడ్డ చెన్న బసవేశ్వర స్వామి మఠం పిటిషన్ కు సంబంధించి ఆస్తుల నిర్వహణపై భక్తుల అభిప్రాయాలను తప్పకుండా హైకోర్టుకు అందజేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ మరియు కర్ణాటక రాష్ట్రాలకు సంబంధించి అయా గ్రామాల ,బూడిదపాడు,నెట్టెంపాడు,నాగర్ దొడ్డీ,ధ్యాగదొడ్డీ,ఉప్పేరు, గార్లపాడు,చింతరేవుల,పెద్దకురం, అనుగొండ, ముస్లాయిపల్లి,సర్జాపురం,యాపలదిన్నె,గాజు లపాడు తదితర గ్రమాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్యకర్తలకు అండగా ఉంటా..

**పార్టీ కోసం ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడాలి**

**త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలి**

**కేటి దొడ్డి మండలం బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న జిల్లా నాయకులు బాసు హనుమంతు నాయుడు**

**గద్వాల(కేటిదొడ్డి),ఆగస్టు10(నమస్తే ఉదయం):** బీఆర్ఎస్ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని జిల్లా నాయకులు బాసు హనుమంతు నాయుడు భరోసా ఇచ్చారు. శనివారం కేటిదొడ్డి మండలం వెంకటాపురంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అంతక ముందు పాగుంట శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారిని బీఆర్ఎస్ నాయకులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఈ సందర్భంగా బాసు హనుమంతు నాయుడు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని ఏ సమస్య వచ్చినా నిర్మోహమాటంగా తన వద్దకు వచ్చి చెప్పాలని ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎనిమిది నెలల్లోనే ఘోరంగా విఫలం అయిందని అని అన్నారు. ప్రభుత్వంపై ప్రజల నుంచి వ్యతిరేకత మొదలైందని వారన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామగ్రామాన తిరిగి బీఆర్ఎస్ పార్టీ వారిని సర్పంచులుగా గెలిపించుకుందామని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్త కు భవిష్యత్తులో మంచి భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు.

అనంతరం బాసు హనుమంతు నాయుడు ను వివిధ గ్రామల పార్టీ కార్యకర్తలు, ప్రజలు శాలువాతో ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మోనేష్ మారోజు, ఎస్.రాము, శేఖర్ నాయుడు, తిరుమల, గోవిందు, ఇర్కి చేడు జగదీష్, కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, రహిమద్, అనుసర్, పాగుంట లక్ష్మీపతి, ఈర్ల బంద గోవిందు, మున్నూరు వీరారెడ్డి, తిరుపతి, కిషన్ రెడ్డి, కొండాపురం ప్రహ్లాద్, ఎన్.రవి, రాజు నాయుడు,నాగరాజు,నల్లా రెడ్డి,కామేష్, మరియు వివిధ గ్రామాల పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## ప్రజా సమస్యలపైన
# సీపీఐ పార్టీ నిరంతర పోరాటాలు

**సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఏం బాల్ నరసింహా**

**మోడి పాలనలో దేశం ధనవంతుల చేతుల్లోకెల్లి ప్రజలు పేదలు నిర్వీర్యం అవుతున్నారు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 10(నమస్తే ఉదయం):** కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ప్రజా సమస్యలపైన నిరంతరం పోరాటాలు నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఏం బాల్ నరసింహ పిలుపు ఇచ్చారు .
శనివారం సీపీఐ జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశాన్ని గద్వాల పట్టణంలోని వాల్మీకి భవన్ లో జరిగిన సమావేశానికి బాల్ నరసింహ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.
ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో బీజేపీ మోడీ పాలనలో ఇండియా ధనవంతుల చేతులోకి వెళ్లి ప్రజలు మరింత పేదలుగా మారుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మతమంటూ అభివృద్ధి ప్రజల అవసరాలను జీవితాలను గాలికొదిలేసినారన్నారు. ప్రజలకు జీవన ప్రమాణాలు పెంచకుండా ఉపాధి అవకాశాలు కల్పించకుండా కొద్ది మంది పెట్టుబడి దారుల ప్రయోజనాలకోసం చట్టాలు చేయడం అంటే దేశానికి భవిష్యత్ లేకుండా చేయడమేనన్నారు.

ప్రభుత్వ రంగాలను బాగు చేయకుండా మొత్తం ప్రైవేటీకరణ చేయడమంటే అత్యధిక జనాభా పేద వర్గాలున్న ఈ దేశం ఎట్లా నిలబడగలుగుతుందని ప్రశ్నించారు. అందుకే ప్రజలు సామాన్యుల కోసం నిరంతరంగా త్యాగాలు పోరాటాలు చేసే కమ్యూనిస్టు పార్టీలు బలపడినప్పుడే ప్రజలకు మేలు జరుగుతుందని స్పష్టం చేశారు నేడు కమ్యూనిస్టులు బలంగా ఉండింటే పెట్టు బడిదారుల ఆటలు సాగేవి కావన్నారు దురదృష్టవశాత్తూ పెట్టు బడిదారులు మతోన్మాదులు కమ్యూనిస్టుల మీద విషం కక్కుతూ దుష్ప్రచారం చేస్తూ వాళ్ళ దోపిడీ కాలాన్ని నడుపుతున్నారని ఆగ్రహం వెలిబుచ్చారు. రాష్ట్ర లో కాంగ్రెస్ ప్రభుత్వంలో సీపీఐ పార్టీ అభివృద్ధి విషయంలో సహకారం ఇస్తూనే ప్రజల బాగోగుల కోసం పోరాటాలు ఎత్తుకొని ఆయా పాలకులకు గుర్తు చేస్తామన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా లో పెండింగ్ ప్రాజెక్టుల నెట్టెం పాడు, గట్టు, తుమ్మిళ్ల ఎత్తిపోతుల ప్రాజెక్టులను పూర్తి చేసి ర్యాలం పాడు రిజర్వాయర్లను పునర్నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు, చిన్నోని పల్లి రిజర్వాయర్ ఉపయోగం లేనందున రద్దు చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో ప్రాజెక్టుల సందర్శన సీపీఐ ఎంఎల్ఏ సాంబశివ రావు తో కలసి చేస్తామన్నారు. జిల్లాలో పార్టీ ప్రజా సంఘాల నిర్మాణం పెంచాలని అందుకోసం నాయకత్వం కృషి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి డి.ఆంజనేయులు జిల్లా నిర్మాణం పైన మాట్లాడారు కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు పెద్దబాబు రవి కృష్ణ ఆశన్న నాగార్జున గోపాల్ రావు సిద్ధప్ప చిన్నయ్య కాసిం బుచ్చన్న ప్రవీణ తదితలతో పాటు మీద ప్రజాసంఘాల నాయకులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.




## పంద్రాగస్టుకు ప్రతి ఇంటిపై
# జాతీయ జెండా ఎగరాలి

**- బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి**

**రాజేంద్రనగర్, ఆగస్ట్ 10(నమస్తే ఉదయం):** ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగిరే విధంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని బిజెపి రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి అన్నారు.
శనివారం అత్తాపూర్ డివిజన్ డివిజన్ అధ్యక్షులు సాబాధ విజయ్ కుమార్ డివిజన్ బిజెపి కార్యవర్గ సమావేశం అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు శ్రీ రాం నగర్ సర్పంచి, సీనియర్ నాయకులు ఎస్ ప్రభాకర్ రెడ్డి హాజరయ్యా. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ... కార్యకర్తలు నాయకులు కేంద్ర ప్రభుత్వాలను ప్రజల ముందుకు తీసుకెళ్తూ బూత్ స్థాయిలో వాటిని బలోపేతం చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపుమేరకు హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమం స్వతంత్ర సమరయోధుల విగ్రహాల ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమాలు యువమోర్చా ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో తిరంగా స్కూటీ ర్యాలీలు నిర్వహించాలని కోరారు . ఈనెల14 న విభజన గాయాల స్మారక దినంగా కార్యక్రమం నిర్వహించాలని 15న వాడవాడల అన్ని బూతుల్లో స్వాతంత్ర వేడుకల కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.
ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ అసంబ్లీ కన్వీనర్ పొన్నమోని మల్లేష్ యాదవ్, నాయకులు మల్లారెడ్డి, రాచూరి రాజశేఖర్, జయానంద్ రెడ్డి, కుక్కునూరి కిరణ్ చారి, సుల్గె వెంకటేష్, సిద్ధేశ్వర్, కకుళారం కృష్ణ ,రావుల జగన్, సాయి యాదవ్, ఉమా, హొల్లాలే లఖన్ గైక్వాడ్, పొట్ట అనీల్, పొట్ట గాయత్రి, బీ రాజశ్రీ, బాల కృష్ణ, బీటుకురి సతీష్ కుమార్, రాము , విజయ్ రావత్, సందీప్ ,ఎం సరితా, సామ యాదగిరి రెడ్డి, ఉమాశంకర్, అమృత, రణదీర్ సింగ్, శశికాంత్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ సతీమణి జమునకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న బీసీ సంఘం ప్రతినిధులు

## ఈటల జమునకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బీసీ సంఘం నాయకులు

మల్కాజిగిరి, ఆగస్టు 10(నమస్తే ఉదయం): మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ సతీమణి జమునకు ఆమె జన్మదినం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సాయి కిరణ్ గౌడ్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకురాలు స్వప్న , హైమారెడ్డి పాల్గొన్నారు.

## ఉప్పర్‌పల్లికి ఆర్టీసీ సర్వీసులను నడపాలి

### స్థానిక మహిళలు ఆర్టీసీ అధికారులకు విజ్ఞప్తి

రాజేంద్రనగర్, ఆగస్ట్ 10(నమస్తే ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఉప్పర్ పల్లి కి ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆదిరాల సంధ్య ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో అధికారులను కలిసి విజ్ఞప్తి చేశారు .30 క్రితం నుండి ఆర్టీసీ 94 బస్ సర్వీసులను నడుపుతోందని సంధ్య ఆర్టిసి అధికారులకు వివరించారు. ఉప్పరపల్లి లో మధ్య, సామాన్య ప్రజలు రోజు వివిధ పనుల కోసం నగరానికి



ఉప్పరపల్లికి బస్సు నడపాలని ఆర్టీసీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్న ఉప్పరపల్లి మహిళలు

ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారని అయితే గతంలో కొనసాగుతున్న ఆర్టీసీ సర్వీసులు సక్రమంగా నడపకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అందుకు అధికారులు సానుకూలంగా స్పందించి క్షేత్రస్థాయిలో తనను పరిశీలించి బస్సు సర్వీసులను నడపడానికి తగిన చర్యలు ఆర్టీసీ అధికారులను కలిసిన వారిలో ఉప్పరపల్లి మహిళలు టీ పుణ్యవతి, కె రమాదేవి, వై ప్రమీల, ఎం పద్మ, సిహెచ్ మౌనిక, సిహెచ్ సుగుణమ్మ, పెంటమ్మ, మంగ, సునీత, మనోహర, పుష్పమ్మ, యోషిద, అండాలు, లలిత పోచమ్మ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి కాలువలను పరిశీలించిన గద్వాల ఎమ్మెల్యే

గద్వాల,ఆగస్టు10(నమస్తే ఉదయం)?: కేటిదొడ్డి మండలంలోని పలు గ్రామాలలో ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి విడుదల అగు సాగునీటి కాలువలను శనివారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పరిశీలించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...
గత సంవత్సరంలో కాలువలకు సంబంధించి మరమ్మత్తు పనులను త్వరిత గతిన పూర్తి చేయించి ఈ సంవత్సరం చివరి ఆయకట్టుకు నీరు అందే విధంగా కృషి చేసినట్లు పేర్కొన్నారు. ర్యాలంపాడు రిజర్వాయర్ ను పూర్తిస్థాయి నీటిమట్టం నాలుగు టీఎంసీలు కానీ లీకేజీ కారణాలవల్ల కేవలం 1:30 టీఎంసీల నిలువ ఉన్నట్లు ఈ సమస్యను సీఎం రేవంత్ రెడ్డి



దృష్టికి కూడా తీసుకువెళ్లినట్లు త్వరలోనే నిపుణుల కమిటీ వేసి సమస్యను పరిష్కరిస్తాం అని హామీ ఇచ్చారు. ర్యాలంపాడు రిజర్వాయర్ ను లీకేజీలను పనులు పూర్తి చేసి పూర్తి సామర్థ్యం నీటిని పెంచే విధంగా రెండు పంటలకు అదే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ విజయ్, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు, నాయకులు ఉరుకుందు హనుమంతు, తిమ్మారెడ్డి, రంగా రెడ్డి, గోపాల్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుంది...

### 45 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ...

కూకట్‌పల్లి, ఆగస్టు 10 (నమస్తే ఉదయం): కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. నియోజకవర్గం పరిధిలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకొనగా 45 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ. 18,42,000/- పద్దెనిమిది లక్షల నలబై రెండు వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను బాధిత కుటుంబాలకి పాపి రెడ్డి నగర్ కాంటెస్టడ్ అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి మరియు ఇతర నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అందజేశారు.ఈ కార్యక్రమం లో ఈ రెడ్డి దేవేందర్ రెడ్డి, మాయ బాల నరసింహ, సంపత్ రెడ్డి, శ్రీకాంత్, మోహన్ రెడ్డి, సురేష్ ఇతరులు పాల్గొన్నారు.



### న్యాయవాదులపై దాడి చేసిన జనగాం పోలీసుల తీరుపై

# డీజీపీకి ఫిర్యాదు చేసిన అడ్వకేట్ బృందం..

**భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలి...**

**సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన శిక్షలు తీసుకోవాలి**

కూకట్‌పల్లి, ఆగస్టు 10 (నమస్తే ఉదయం): జనగామ, సిద్దిపేట, సిరిసిల్ల, సూర్యాపేట, మల్కాజిగిరి, వేములవాడ వేరు వేరు ప్రాంతాలలో పోలీసులు న్యాయవాదులపై ప్రదర్శించిన తీరు, దాడులు అక్రమ కేసులు వంటి సంఘటనలపై తెలంగాణ రాష్ట్రంలోని వివిధ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లతో కలిసి రాష్ట్ర డీజీపీని కలిసి ఫిర్యాదు చేశారు.ఈ నేపథ్యంలో భాదింపబడే వారి పక్షాన అహర్నిశలూ న్యాయ పోరాటం చేస్తున్న



డిజిపికి వినతి పత్రం అందజేస్తున్న న్యాయవాదులు

న్యాయవాదులపై ఇలాంటి దాడులు జరపడం ప్రజాస్వామ్య వ్యవస్థలో మంచి పరిణామం కాదని వివరిస్తూ, ఇప్పటివరకు జరిగిన సంఘటనలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘ టనలు పునరావృతం కాకుండా చొరవ చూపాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర వివిధ కమిషనరేట్లకు ఆదేశాలు, సర్కులర్సు, జారీ చేయమని తెలంగాణ రాష్ట్ర డిజిపిని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు క్రాంతి కుమార్, రంగారెడ్డి జిల్లా ప్రెసిడెంట్ వై కొండల్ రెడ్డి, నాంపల్లి బారసోసియేషన్ ప్రెసిడెంట్ జి రాజవర్ధన్ రెడ్డి, కరీంనగర్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి. వి రాజకుమార్, ధరూర్ బారాసోసియేషన్ జనరల్ సెక్రెటరీ రామకృష్ణ, సిరిసిల్ల వేములవాడ బార్ అసోసియేషన్ సభ్యులు, వేణు, రవీందర్, సుదర్శన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 1,2 తేదీలలో వెండికొండజాతర..

**భారీగా తరలివచ్చే భక్తులకు అను గుణంగా ఏర్పాట్లు. ..**

శంషాబాద్, ఆగస్టు 10(నమస్తే ఉదయం): శంషాబాద్ ప్రజల ఇలవేల్పు వెండికొండ సిద్దేశ్వర స్వామి జాతర సెప్టెంబర్ ఒకటి. రెండు తేదీలలో నిర్వహించాలని నిర్వాహకులు నిర్ణయించారు. సిద్దేశ్వర ఆలయంలో శనివారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమో దించారు. ప్రతి ఏటా శ్రావణమాసం చివరి వారంలో వెండికొండ సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు. జాతర నిర్వహించడం గత 60 సంవత్సరాలుగా ఆనవాయితీగా వస్తున్నది. ఈనెల 31వ తేదీన శంషాబాద్ పట్టణంలోని వీరభద్ర స్వామి ఆలయం నుండి వెండికొండ సిద్దేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా దేవాలయానికి తీసుకెళ్తారు.

శంషాబాద్ పురపాలక సంఘం పరిధిలోని అన్ని వీధులలో ఊరేగింపు నిర్వహించిన అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను ప్రధాన ఆలయానికి చేరుస్తారు. ఆ తరువాత సెప్టెంబర్ ఒకటి. రెండవ తేదీలలో జాతరను నిర్వహించాలని నిర్ణయించారు. జాతర వేడుకలకు దాదాపు 50 వేల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున నిర్వాహకులు నిర్ణయించారు. ఉషా కమిటీ సమావేశంలో స్థానిక మాజీ సర్పంచ్ గణేష్ గుప్తా. నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దూడల వెంకటేష్ గౌడ్. సింగిల్ విండో మాజీ చైర్మన్ కొలను మహేందర్ రెడ్డి. కొత్త నరసింహారెడ్డి. ఆలయ కమిటీ చైర్మన్ మడపతి



వెండికొండ ఆలయంలో సమావేశమైన నాయకులు

నరేందర్. నిర్వాహక కమిటీ సభ్యులు అడియాల అరుణ్ కుమార్. కూచిరెడ్డి శంకర్ రెడ్డి. కూచిరెడ్డి చక్రధర్ రెడ్డి.పారేపల్లి శ్రీనివాస్ గౌడ్. పండరినాథ్ గుప్తా. కొలను బలవంత రెడ్డి. జెల్లపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కేపీహెచ్‌బీ డివిజన్‌ను కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశాం...

**9వ పేస్‌లోని మూడెకరాల స్థలాన్ని జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో ఆదర్శవంతమైన పార్కుగా తీర్చిదిద్దాలి...**

**సృజన ఫోరమ్ మాల్ ఫ్లై ఓవర్ కింద క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేయాలి...**

**అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు....**

కూకట్‌పల్లి,ఆగస్టు 10 (నమస్తే ఉదయం): కేపీహెచ్‌బీ డివిజన్ ను కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామని, కూకట్‌పల్లి నియోజక వర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరిచామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు.

కూకట్‌పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కేపీహెచ్‌బీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు డివిజన్ పరిధిలోని వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి పరి శీలన చేశారు. ఇందులో భాగంగా మలేషియన్ టౌన్షిప్ వెనకాల 5ఎకరాల పార్కు పరిశీలన అనంతరం పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. పక్కనే ఉన్న మరో ఐదు ఎకరాల స్థలాన్ని, తొమ్మిదోవ ఫేస్ లోని మూడు ఎకరాల స్థలాన్ని జిహెచ్ఎంసి, హెచ్ఎండిఏ అధ్వర్యంలో ఆదర్శవంతమైన



పార్క్ ని నిర్మించాలని తెలిపారు. ఈ విషయమై ఇప్పటికే సీఎంకి, జిల్లా మంత్రులకు వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. వన్ సిటీ పక్కనే ఉన్న హౌసింగ్ బోర్డు కాళీ స్థలాన్ని మహిళా పార్క్ మాదిరిగా అభివృద్ధి చేయడంతో పాటు రోడ్డుపై నీళ్లు నిలవకుండా ఉండేలా వాటర్ హార్వెస్టింగ్ పిట్స్ నిర్మించాలని అధికారులను ఆదేశించారు.

అదేవిధంగా ఫోరం మాల్ ఎదుట ఫ్లై ఓవర్ కింద ఇండోర్ క్రీడా ప్రాంగణానికి సంబంధించిన పనులు పరిశీలించి త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని సూచిం చారు. అలాగే 4వ ఫేస్ ఎస్ టి పి ప్లాంట్ వద్ద ఫ్లైఓవర్ క్రింద ప్రాంగణానికి సంబంధించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఇక్కడి చిరు వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టాలనీ, ఫ్లై ఓవర్ కింద సందర్శకులకు అనువుగా ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని అవసరమైన సదుపాయాలు కల్పించాలని అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కెపిహెచ్బి డివిజన్లో వేలకోట్ల రూపాయలతో గత పది ఏళ్ల నుంచి అభివృద్ధి చేస్తూ వస్తున్నామని, ఇందుకు నిదర్శనమే అనేక పార్కులు క్రీడా మైదానాలు, ఇండోర్ షటిల్ కోర్టులు మొదలైనవి ప్రజలు ఇప్పటికేవినియోగించుకుంటున్నారని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం మరిన్ని పార్కులు క్రీడా ప్రాంగణాలు అందుబాటులో తీసుకొచ్చేందుకు సత్వర చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, ఈఈ శ్రీనివాస్, డిఈ ఆనంద్, ఏఈ సాయి ప్రసాద్, యు బి డి సమత, వాటర్వర్క్స్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, వెంకటేష్, నాయకులు, కార్య కర్తలు, మహిళ నాయకులు, కాలనీ వాసులు మరియు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే సహించేది లేదు..

**కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్**

కూకట్‌పల్లి, ఆగస్టు 10 (నమస్తే ఉదయం): అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ అధికారులను హెచ్చరించారు. నియోజకవర్గ పరిధిలోని ఫతేనగర్ డివిజన్ ఇందిరా గాంధీ పురం దగ్గర్లో రూ 60 లక్షలతో నూతనంగా నిర్మితమవుతున్న సిమెంట్ రోడ్డు పనులను అయన పరిశీలించారు. డివిజన్ అధ్యక్షుడు స్థానిక నాయకులు ఈ రహదారి నిర్మాణంలో నాణ్యత లోపంతో జరుగుతుందని రమేష్ కు ఫిర్యాదు చేయడంతో ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ ఈ శ్రీనివాస్, డి ఈ ఆనంద్, ఏఈ పవన్‌లతో ఫోన్లో మాట్లాడి రహదారి నిర్మాణ నాణ్యత పై ప్రశ్నిం చారు. దీనిపై క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్ తమకు అందజే యాల్సిందిగా సూచించారు. బస్తిలోని మంచినీటి సమస్యపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం బాలానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మధు గౌడ్ గృహప్రవేశానికి వెళ్లి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ నాయకుడు సాధు ప్రతాపరెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్య క్రమంలో నాయకులు మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, నాగిరెడ్డి, రమేష్, బాకీ, వరహాలస్వామి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733